ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం



కలెక్టర్‌కు అరుదైన గౌరవం



పార్వతీపురం : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డికి ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బిఎస్‌ఎన్‌ఎఎ) నుంచి అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 27, 28 తేదీల్లో ముస్సోరిలో జిల్లా కలెక్టర్ల కోసం నక్షా కార్యక్రమంపై శిక్షణ ఇచ్చేందుకు రావాలని ప్రభాకరరెడ్డిని ఆహ్వానించింది. జిల్లా కలెక్టర్లకు 27న నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రెవెన్యూ ఎక్స్పర్ట్ (భూ సమస్యల దేశ స్థాయి నిపుణులు) శిక్షణ ఇవ్వాలని బిఎన్ యుగంధర్ సెంటర్ ఫర్ రూరల్ స్టడీస్ డైరెక్టర్ కోరారు. రెవెన్యూ, సర్వే, భూ రికార్డుల వంటి భూ పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన విషయాలపై దేశంలోనే అత్యంత అనుభవం, మంచి పరిజ్ఞానం కలిగిన అధికారిగా కలెక్టరుకు మంచి పేరు ఉండడంతో ఆయన్ను ఈ మేరకు ఆహ్వానించింది.

మన్యం గుండెల్లో పవర్ చిచ్చు

- ఏజెన్సీని వెంటాడుతున్న పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు
- ఒకటి పోతే మరొకటి మంజూరు చేసిన ప్రభుత్వం
- దుగ్గేరులో చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనుల గుండెల్లో మరో పవర్ చిచ్చు రేపడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సాక్ష్యాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే మరో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడానికి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మక్కువ మండలం దుగ్గేరులో చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును 2వేల మెగావాట్ల పవర్‌ప్లాంట్ నెలకొల్పేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ప్రాంత గిరిజనుల్లో ఆందోళన మొదలైంది. కొండల చుట్టూ వాగులు, వంకలను నమ్ముకుని జీవిస్తున్న తమ బతుకుల్లో మంటలు రేపాలని ప్రభుత్వం చూస్తే ప్రతిఘటిస్తామని గిరిజన సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే సిపిఎం జిల్లా కమిటీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించింది.

చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును అడ్డుకుంటాం



మక్కువ మండలం దుగ్గేరు ప్రాంతంలో చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పా టును అడ్డుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుంది. 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదించడం అభ్యంతరకరం. దీనివల్ల వందలాది గిరిజన కుటుంబాలు నిరాశ్రయులవుతారు. సాగుభూములు కోల్పోతారు. సాలూరు మండలంలోని కురుకుట్టి ప్రాంతంలో పవర్ ప్రాజెక్టును రద్దు చేసిన ప్రభుత్వం పక్కనున్న మండలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సరికాదు. నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి సంధ్యారాణి దీనిపై స్పందించాలి.

కొల్లి గంగు నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి.

ప్రభుత్వం అడుగు ముందుకేస్తే గిరిజనులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించింది. పచ్చనిపొలాలు, ప్రశాంతంగా ఉన్న గిరిజన ఆవాసాల మధ్య పవర్ ప్లాంట్ సెగలు రేపడానికి గత ప్రభుత్వం నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాలూరు మండలం కురుకుట్టి ప్రాంతంలో 1200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించింది. అదానీ కంపెనీ సహకారంతో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టింది. సుమారు పది గ్రామాల ఉనికికే ప్రశ్నార్థకంగా మారిన ఈ పవర్ ప్రాజెక్ట్‌ను ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటించారు. ప్రాజెక్టు పనులు ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. దీంతో ఆ పవర్ ప్లాంట్ పనులు నిలిచిపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పవర్ ప్లాంట్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గిరిజనుల వ్యతిరేకతతో పాటు ఈ ప్రాజెక్టు పరిధిలో ఆంధ్రా - ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాలు ఉన్నందున ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ప్రాజెక్టు రద్దుతో కురుకుట్టి ప్రాంత గిరిజనులు, కొటియా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అదానీ ప్రాజెక్టు రద్దయిందని ఆనందంలో ఉండగా మరో పవర్ ప్రాజెక్ట్ పాచిపెంట మండలాన్ని వెంటాడుతోంది.

పాడేరు జిల్లా అనంతగిరి మండలంలోని గుజ్జెలిలో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకు గాను భూసేకరణ చర్యలు చేపట్టింది. పాచిపెంట మండలంలోని శతాబ్ది, గొట్టూరు, గర్గిగుడ్డి, తంగలం, బొర్రా మామిడి గ్రామాల పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాల భూముల్లో నవయుగ కంపెనీ హద్దు రాళ్లు పాతింది. ఈ గ్రామాల గిరిజనుల అభిప్రాయం తీసుకోకుండా గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో రాళ్లు పాతడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన అనంతగిరి మండలంలోని గిరిజనులతో కలిసి పాచిపెంట మండలం లోని గిరిజనులు కూడా పోరుబాట పట్టారు. నవయుగ కంపెనీ ప్రతినిధులు గిరిజన భూముల్లో పాతిన రాళ్లను గిరిజనులు పీకేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పుండు మీద కారం చల్లినట్టు మక్కువ మండలంలోని దుగ్గేరు ప్రాంతంలో సుమారు 2వేల ఎకరాల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం ఆ ప్రాంత గిరిజనుల్లో ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని తోటపల్లి బ్యారేజి నుంచి సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే దుగ్గేరు ప్రాంతంలో సురాపాడు మినీ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంది. ఇది పూర్తయితే వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. అయితే ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా ఈ ప్రాంతం నుంచి గిరిజనులను తరిమేసే పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్‌కు అనుమతి మంజూరు చేయడం వివాదాస్పదమవుతోంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చింతా గ్రీన్ ఎనర్జీ కంపెనీ చర్యలు చేపడితే అడ్డుకునేందుకు వామపక్ష, గిరిజన సంఘాలు సిద్ధమవుతున్నాయి.



చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ గ్రామాల గిరిజనులతో దుగ్గేరులో నిర్వహించిన సభలో పాల్గొన్న గిరిజనులు

మంత్రికి తలనొప్పి

మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు చిచ్చు వెంటాడుతోంది. కురుకుట్టిలో మంజూరైన అదానీ పవర్ ప్రాజెక్టు రద్దు చేసిన విషయాన్ని మంత్రి సంధ్యారాణి గొప్పగా చెప్పారు. తమ ప్రభుత్వం గిరిజనుల పక్షపాతి అని ప్రకటించారు. అయితే ఆ ఆనందం మున్నాళ్ళ ముచ్చటగానే మిగిలింది. కొద్దిరోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దుగ్గేరు ప్రాంతంలో చింతా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు అనుమతి మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పాచిపెంట మండల సరిహద్దు ప్రాంతంలో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ముందుకెళ్తున్న నేపథ్యంలో ఆ ప్రాంత గిరిజనులు పోరాడుతున్నారు. ఇది చల్లారకముందే ప్రభుత్వం మరో పవర్ ప్రాజెక్ట్‌ను ఆమె నియోజకవర్గంలోని మక్కువ మండలంలో ఏర్పాటుకు నిర్ణయించడం కొత్తగా తలనొప్పిని తెచ్చిపెడుతోంది. నియోజకవర్గ గిరిజన ఎమ్మెల్యేగా ఈ ప్రాంత గిరిజనుల ప్రయోజనాలు కాదనలేని, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించలేని ఇరకాట స్థితిలో ఆమె వున్నట్లు కనిపిస్తోంది.

మొక్కజొన్న రైతులు కుదేలు

- నష్టం మిగిల్చిన తుపాను
- పరిహారం కోసం ఎదురుచూపు
- పెట్టుబడులు కూడా రావని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరుగాలం కుటుంబ సమేతంగా కష్టించి పండించిన పంట మరికొద్ది రోజుల్లో చేతికి వస్తుందన్న తరుణంలో తుఫాను కారణంగా మొక్కజొన్న పంట నాశనమైంది. దీంతో ఈ ఈ పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశాల్లేవని, నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిట్టపూడి వలసకు చెందిన గుండ్రెడ్డి సూర్యనారాయణ, సురేష్, బాలకృష్ణ, సింహాచలం, నల్ల రఘునాయుడు, షణ్ముఖ, యమక చినఅప్పలస్వామి, మరిచర్ల సత్యనారాయణ, చిన్నమ నాయుడు, సింగపురం శ్రీనివాసరావు, రెడ్డి సత్యంనారాయణ, ఎం.సంగం నాయుడు, చంద్రశేఖర రావు, దారపురెడ్డి శ్రీరామ్మూర్తి, చిగురుకోట సీతారాములు, బవిరిరాజు తదితర రైతులకు చెందిన సుమారు 70 ఎకరాల పైబడి మొక్కజొన్న పంట తుఫాను ప్రభావంతో నేలమట్టమైందని రైతులు కంటతడి పెడుతున్నారు. పండిన పంట చేతికి వచ్చేసరికి దాదాపు ఎకరాకు రూ.25 వేలు నుంచి రూ.30వేలు వరకు పెట్టుబడి అవుతుందని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడి బాగున్నప్పటికీ ఖర్చులు పోనూ చేతికి కొంత వస్తాదని ఆశించినప్పటికీ తుఫాను ప్రభావం కారణంగా ఆశలపై నీళ్లు చల్లినట్లయి అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంటపై చేసిన అప్పులు తీరుతాయన్న ఆశలు ఆవిరై పోయిందని రైతులు వాపోతున్నారు. తుఫాను ప్రభావం వల్ల పంట నష్టం సరిచూడడంతో ఉన్న దగ్గర ఏరిన మొక్కజొన్న పొత్తులు కూలి డబ్బులు కూడా రావేమోనని రైతులు వాపోతున్నారు.



తుపాను ప్రభావంతో పాడైపోయిన మొక్కజొన్న పొత్తులు

ఈ విషయమై స్థానిక ఉద్యానవన శాఖ అధికారి జయశ్రీ 'ప్రజాశక్తి' ప్రస్తావించగా మొక్కజొన్న, అరటి పంట నష్టాల అంచనాల జాబితాలు తయారు చేస్తున్నామని తెలిపారు.

వచ్చారు... చూశారు.. వెళ్లారు

ఈనెల 2న తుఫాను ప్రభావం కారణంగా మండలంలోని చిట్టపూడివలసలోని 70 ఎకరాలకు పైబడి మొక్కజొన్నతో పాటు కంబర, నడిమికెళ్ల, దశమంతపురం తదితర గ్రామాల్లో 420 ఎకరాల్లో అరటిపంట కూడా నష్టం వాటిల్లడంతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, కూటమి నాయకులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.సత్యనారాయణ రెడ్డి, స్థానిక హెచ్ఒ జయశ్రీ గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారమందేలా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని పరిశీలించి దాదాపుగా 11 రోజులు కావస్తున్నప్పటికీ ఎటువంటి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చారు... చూశారు.. వెళ్లారు తప్ప ఏ విధమైన లబ్ధి చేకూరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విత్తనాల డబ్బులు కూడా రావు

పంట చేతికి అంది వచ్చే తరుణంలో తుఫాను ప్రభావంతో మొక్కజొన్న పంట నాశనం కావడంతో విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బులు కూడా రాని పరిస్థితి. కాయకష్టం తప్ప ఫలితం లభించలేదు. కావున ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలి.

గుండ్రెడ్డి సూర్యనారాయణ, రైతు, చిట్టిపూడి వలస.

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో జెసి సమీక్ష

పార్వతీపురం : పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం సమీక్షించారు. గిరిజన మారుమూల ప్రాంతాల్లో అంబులెన్సులు వెళ్లేలా రహదారులకు అంచనాలను రూపొందించాలన్నారు. అందులో భాగంగా జెఇలు క్షేత్రస్థాయిలో రహదారులను పరిశీలించి వీడియో, ఫోటోలు తీసి వివరించాలని తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కొన్నింటిని పరిశీలించారని, మిగిలిన వాటిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దీనిపై మండల స్థాయిలో సమీక్షించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను జారీచేశారు. అంచనాలు పక్కాగా ఉండాలని తేల్చిచెప్పారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి విఎస్ నగేష్ బాబు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

పారదర్శకమైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - మక్కువ/పాచిపెంట

ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించాలని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి అన్నారు. మక్కువ, పాచిపెంట తహశీల్దార్ కార్యాలయాలను, మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె సూచించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను కూడా ఉంచాలన్నారు. అనంతరం విఆర్ఒలు, సర్వేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేషన్ దుకాణాన్ని కూడా సందర్శించి లబ్ధిదారులకు సరుకులు పంపిణీకి సంబంధించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సమయానుసారంగా, పారదర్శకమైన సేవలు అందించాలని, ప్రతి ఫిర్యాదు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెండు మండలాల తహశీల్దార్లు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

వాణిజ్య పంటలవైపు రైతులు మొగ్గుచూపాలి
కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని ప్రతి రైతు ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని, ఆ దిశగా అధిక రాబడి వచ్చే పంటలు, వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గుచూపాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. అంతర పంటలు వేయడం, ఖాళీగా ఉండే పొలం గట్లపై ఆకుకూరలు, పూలమొక్కలు సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. పొలాల్లో అధిక ఆదాయం వచ్చే విత్తనాలు వేయాలని, వరికి బదులుగా అధిక ఆదాయం వచ్చే పంటల దిశగా రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. రైతులు మఖానా, ఓట్స్, క్వినోవా రైస్, బ్లాక్ రైస్ వంటివి వేసుకోవాలని సూచించారు. ప్రతి పంటపై రైతుకు ఎక్కువ ఆదాయం వచ్చేలా డిపిఆర్ తయారు చేయాలని, ప్రతి రైతు వ్యాపారవేత్తగా ఎదిగేలా చొరవ చూపాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు కలెక్టర్ దిశా నిర్దేశం జారీచేశారు. మండలంలోని మామిడిపల్లి ప్రాంతాన్ని వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం సందర్శించారు. అనంతరం సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఏర్పాటుచేసిన రైతులతో ముఖాముఖి లో కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 67, 000 ఎకరాల్లో సాంప్రదాయ సేద్యం చేస్తున్నామని, అలాగే ఉద్యానవన పంటల్లోనూ మంచి మార్పులు వస్తున్నాయని, ఈ ఏడాది జిల్లా అభివృద్ధిలో వ్యవసాయ, ఉద్యానవన రంగాలు కీలకపాత్ర పోషించనున్నట్లు వివరించారు. గతంలో కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ వృద్ధిని మనం చూడబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి మంచిగా వర్షాలు కురవడం వల్ల పంటలు బాగా వచ్చాయని, కావున ఈ ఏడాది జిల్లా మరింత అభివృద్ధిని, ఆదాయాన్ని పొందుతుందని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సంప్రదాయ పద్ధతుల్లో పంటల్ని పండించడమే కాకుండా అంతర్ పంటలపై కూడా మంచి అవగాహన ఉందని కితాబిచ్చారు. అలాగే పొలంగట్ల పైన కూడా అనేక రకాలైన కూరగాయల్ని, పూలమొక్కల పంటలను సాగుచేసి ఉన్నతంగా ఆలోచన చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. రైతుకు లాభం చేకూర్చాలంటే వాణిజ్య పంటల గురించి, అధిక రాబడి తెచ్చే పంటలపై అవగాహన ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖకు సూచించారు. ఇక్కడి పొలాలు అరటి, చెరకు, వరి, మొక్కజొన్న పంటలకు అనుకూలమని, దీన్ని సంప్రదాయ సేద్యం చేయడం ద్వారా మరింత మెరుగైన ఆదాయం ఆర్జించవచ్చని అన్నారు. నాటు చెరకు కాకుండా ఈ కాలానికి తగ్గట్టుగా మేలు రకమైన విత్తనాలు వేయించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి టి.సంతోష్ కుమార్, సాలూరు ఎడిడి, ఎఒ, మండల అధికారులు, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, విఎఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో ప్రకృతి సేద్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

అంగన్వాడీ కేంద్రంలో 'ముస్తాబు'

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ముస్తాబు కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సిడిపిఒలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ముస్తాబు కార్యక్రమం నిర్వహించి, అద్దం, సబ్బు, దువ్వెన, టవల్, బకెట్, హ్యాండ్ వాష్, పిల్లలు శుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. అలాగే చిన్న మ్యూజిక్ బాక్స్ ఉండాలని తేల్చిచెప్పారు. ప్రతి విద్యార్థి ఒక మంచి పౌరుడుగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. పిల్లల విద్యా ప్రమాణాలు మరింత పెరగాలన్నారు. విద్యార్థులు ధృఢమైన మానసిక స్థితి, దృఢమైన ప్రవర్తన కలిగి ఉండాలని, తద్వారా ఒత్తిడిని తట్టుకొని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని, బాధ్యతాయుతమైన ప్రవర్తనను కలిగి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు పిల్లల ఆరోగ్యం అతి ముఖ్యమని, దీనికి అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. పిల్లలంతా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలని, రక్తహీనత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సీజనల్ వ్యాధులు, వ్యక్తిత్వ వికాసం పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. శత శాతం డెంటల్ చెకప్ చేయించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించాలని వివరించారు. అంగన్వాడీల్లో వ్యక్తిగత పరిశుభ్రత, శుభ్రమైన దుస్తులు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెసి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, విద్యాశాఖ అధికారి శంకర్, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, పాఠశాల ఉపాధ్యాయులు, సిడిపిఒలు, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు తోటపల్లి ఆలయాల హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని వెంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి ఆలయాల హుండీల లెక్కింపు బుధవారం చేపట్టనున్నామని దేవస్థానం ఇఒ వివి సూర్యనారాయణ వెల్లడించారు. గ్రామపెద్దలు,దేవా దాయశాఖ అధికారులు, ట్రస్టు సభ్యులు సమ క్షంలో తెరిచి లెక్కించడం జరుగు తుందని తెలిపారు.

ఎప్పుడొస్తారో ఎవరికెరుక?

సచివాయల సిబ్బంది రాక కోసం గిరిజనుల నిరీక్షణ

ప్రజాశక్తి - సాలూరు

వివిధ రకాల పనుల నిమిత్తం గిరిశిఖర గ్రామాల నుంచి సచివాలయాలకు వస్తే కనీసం తమను పట్టించుకునే నాధుడే లేడని కొటియా గ్రూపు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఏ విధమైన పనులు కావాల్సినా, సంక్షేమ పథకాల కోసం నమోదు చేసుకోవాలన్నా సచివాలయాలకు వచ్చి నమోదు చేసుకోవాలి. ఇటువంటి పనులన్నిటినీ చేయాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉంది. కానీ వీటన్నింటికీ అనుగుణంగా సచివాలయ సిబ్బంది పనిచేయడంలేదని ఆరోపిస్తున్నారు. వీరు ఎప్పుడూ విధులకు సమయానికి రావడంలేదని, దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం ఇస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గందరగోళంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు కార్డులిస్తామని సచివాలయానికి రావాలని చెప్పడంతో గిరిశిఖర గ్రామాల నుంచి జీపులు, ఆటోలపై వచ్చాక కార్యాలయంలో సిబ్బంది ఎవరూ ఉండడంలేదని, దీంతో తాము చాలా ఇబ్బందులు పడాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎగువ గంజాయి భద్ర, దిగువ గంజాయి భద్ర, గరిసిగుడ్డి గిరి శిఖర గ్రామాల నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి ఇక్కడికి ఉదయం 10గంటలైందని, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పిన మండలంలోని సారిక సచివాలయ సిబ్బంది ఏ ఒక్కరూ రాకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోతున్నామన్నారు. ఇలాంటి సందర్భాలు చాలా రోజులుగా జరుగు తున్నా కనీసం తమ బాధలను పట్టించుకొనే నాధుడే లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వారివారి గ్రామాలకు తరలిపోయారు. ఇలా తమను తిప్పడం వల్ల పనులు మానుకొని, ఛార్జీలు చెల్లించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని తమకు అవసరమైన సచివాలయ పనులను మా గ్రామాల్లోకి సిబ్బంది వచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరారు.



సిబ్బంది కోసం సారిక సచివాలయం వద్ద ఎదురు చూస్తున్న గిరిజనులు

ఆడ బిడ్డ నిధి ఎప్పుడిస్తారు? : సిఐటియు

బలిజిపేట : 2024 నాటి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు వారి ఖాతాలో వేస్తామని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి 15 నెలలు గడిచినా మహిళలకు ఇచ్చిన మాట నెరవేర్చకుండా మోసగించిందని విమర్శించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి మహిళలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొదుపు సంఘాలకు రూ.3లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ ఇస్తామని చెప్పి చంద్రబాబు నాయుడు మహిళలకు మోసగించారని ఆరోపించారు.

సజ్జలను కలిసిన వైసిపి నేతలు

పాలకొండ : తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, 17వ వార్డు కౌన్సిలర్, ఉద్యోగుల పెన్షనర్ల విభాగ వైసిపి నియోజక వర్గ అధ్యక్షులు దుప్పాడ పాపి నాయుడు, జిల్లా అధ్యక్షులు ఎల్లి పుష్పనాధం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పాలకొండ రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు మాట్లాడారు. పార్టీ బలోపాతానికి మరింత కష్టపడి పని చేయాలని సజ్జల సూచించారు



జాతీయ ఎస్‌టి కమిషన్ చైర్మన్ అంతర్‌సింగ్ ఆర్యను కలిసిన వైసిపి నాయకులు

ఎస్‌టి కమిషన్ దృష్టికి విద్యార్థుల మరణాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలను వైసిపి నేతలు జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి మంగళవారం తీసుకెళ్లారు. ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అరుకు, తిరుపతి ఎంపీలు డాక్టర్ తనూజ రాణి, డాక్టర్ మద్దెల గురుమూర్తితో కలిసి ఎమ్మెల్యే రేగా మత్సలింగం, ఉమ్మడి విశాఖపట్నం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మాజీ ఎంపి జి.మాధవి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ స్వాతిరాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తు రాజులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సమస్యలను వివరించారు. కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లతో ఇద్దరు విద్యార్థినులు మృత్యువాత పడ్డారని, మరో 170 మంది అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. కలుషిత తాగునీటి వినియోగం వల్ల గిరిజన విద్యార్థులు మరణించారని తెలిపారు. దీనిపై కమిషన్ చైర్మన్ ఆర్య స్పందిస్తూ రాష్ట్రానికి కమిషన్ బృందాన్ని పంపిస్తామని హామీ ఇచ్చారు.



శ్రమదానంతో రోడ్డు వేసుకుంటున్న గిరిజనులు

గతుకుల మయమైన రోడ్లు

శ్రమదానంతో బాగు చేసుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మర్రిపల్లి పంచాయతీలో గల తోస్సంగి, నేదుమనుగూడ, జోలమానుగూడ తదితర సుమారు 10 గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. దీంతో మంగళవారం ఆయా గ్రామాల గిరిజనులు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణతో కలిసి స్వచ్ఛందంగా పలుగు పారా పట్టి గుంతలను కప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రహదారులు బాగు చేయాలని వినతి పత్రాలు అందించినప్పటికీ పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. అత్యవసర సమయంలో కనీసం 108 వాహనం కూడా వచ్చే పరిస్థితి లేక ద్విచక్ర వాహనం కూడా గుంతల్లో ఇబ్బందులు పడి ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తామే స్వచ్ఛందంగా రహదారిపై ఏర్పడిన గుంతలను కప్పి ప్రయాణ మార్గాన్ని సులభతరం చేస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణాలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

సిఆర్‌టిల పొట్టకొట్టొద్దు : కాంగ్రెస్

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అనేక ఏళ్లుగా పని చేస్తున్న సిఆర్‌టిల పొట్ట కొట్టొద్దని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త గేదెల రామకృష్ణ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఎస్‌సి నుంచి సిఆర్‌టిలను మినహాయించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం వల్ల వారికి తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. ఇప్పుడు డిఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరుతున్నందున సిఆర్టీలను ఇంటికి పంపించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఆర్‌టిల్లో ఎస్టీలకు ప్రాధాన్యత ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పది నుంచి 15 ఏళ్లుగా పని చేస్తున్న సిఆర్టీలను టిడిపి ప్రభుత్వం మోసగించిందని ఆరోపించారు. వారి ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండదని నమ్మించిన ప్రభుత్వం ఏదో ఒక రూపంలో వారి సేవలను వినియోగించుకోవాలని రామకృష్ణ కోరారు.

కంకర తవ్వకాలకు అనుమతుల్లేవు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో కంకర తవ్వకాలకు ఎవరికీ ఎటువంటి అనుమతుల్లేవని, ఒకవేళ ఎవరైనా అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ భరత్‌కుమార్ హెచ్చరించారు. కాశీపట్నం పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై పత్రికల్లో వచ్చిన వార్తలకు ఆయన స్పందించారు. కంకర కొండలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని అక్రమంగా వాహనాలపై ఎవరైనా తరలిస్తే వాటిని సీజ్ చేయడమే కాకుండా కఠిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు



టపాసులు పేల్చుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, నాయకులు

గూగుల్ రాకతో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గూగుల్ టెక్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్‌కు సంబంధించి ఢిల్లీలో ఎంఒయు జరగనున్న శుభసందర్భంగా సిఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలుపుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో మంగళ వారం నాయకులతో కలిసి టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

కాలేజీని సందర్శించిన డివిఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ముందుగా కళాశాలలోని వసతులపై విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులకు సిలబస్, వీక్ ఎండ్ టెస్ట్‌ల ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం రాయడం పట్ల వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక పరిశీలన, పిల్లల హాజరు, క్యాంపస్ క్లీనింగ్, తాగు నీరు పరిసరాల పరిశుభ్రత పట్ల సూచనలు ఇచ్చారు. దీంతో పాటు సిఎఆర్, సిఎంఆర్, స్టాఫ్ రిజిస్టర్లు, అధ్యాపకుల డైరీలు నోట్స్‌లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎల్.డాలి నాయుడు, అధ్యాపకులు రామకృష్ణ, శాంతి, జ్యోతి పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎంఇఒ ఆనందరావు

విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత

ప్రజాశక్తి - సీతంపేట

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కెజిబివి పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిర్మూలన గురించి ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు ఎంఇఒ ఆనందరావు, సిడిపిఒ సింహాలమ్మ విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు అరికట్టాలని పిలుపునిచ్చారు. దీనివల్ల కలిగే అనార్థాలు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, అకౌంటెంట్ సుజాత, సూపర్వైజర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ ప్యాలస్‌ను మ్యూజియంగా మార్చాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

విశాఖ రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక మ్యూజియంగా తీర్చిదిద్దాలని డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనం వృథాకారాదన్నారు. వ్యాపార కేంద్రంగా వినియోగించడం వల్ల ప్రయోజనకరంగా ఉండదని, అందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. భావి యువతకు, విద్యార్థులకు విజ్ఞాన మార్గదర్శిగా నిలపాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను, చరిత్రను చాటి చెప్పే వేదిక కావాలన్నారు. రాజకీయ అవసరాలకు రచ్చ చేయకుండా, స్వార్థ ప్రయోజనాలకు వినియోగించకుండా జాతికి అంకితం చేయాలన్నారు. మ్యూజియం ఏర్పాటుకు మద్దతునిచ్చే ప్రజలు మీ అభిప్రాయాన్ని rushikonda@aptdc.inకు ఈనెల 17 లోగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రంలో మంగళవారం స్మార్ట్ రైస్ కార్డులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డు వినియోగంపై రేషన్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సొంటేన రాజేష్, మద్ది దొరబాబు, సచివాలయం, జిసిసి ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పనితీరు బాగులేకే ప్రభుత్వానికి చెడ్డ పేరు

- మండల సర్వసభ సమావేశంలో ఏఎంసి చైర్మన్ కళావతి
- సమస్యలపై అధికారులను నిలదీసిన ఎంపిపి, సభ్యులు

ప్రజాశక్తి - కురుపాం



ఐటిడిఎ ఎజెన్సీ సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపిపి

మండలంలో అధికారుల పనితీరు బాగో లేకపోవడం వల్లే కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఏఎంసి చైర్మన్ కర్రక కళావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగిన సర్వసభ సమావేశానికి ఏఎంసి చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఐటిడిఎ ఎఇ అప్పారావు మాట్లాడుతున్న సమయంలో పలువురు సర్పంచులు గిరి శిఖర గ్రామాల్లో ఎప్పుడో రోడ్లు పనులు ప్రారంభించి నేటికీ పూర్తి చేయకపోవడంతో కనీసం గిరిజన ప్రజలు రాకపోకలకు వీలు లేకుండా ఉందని, ఇప్పటికైనా రోడ్లు పూర్తిచేసి ప్రజల రాకపోకలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. శివన్నపేట ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు మాట్లాడుతూ ఏడాది క్రితం చేసిన పనులకు నేటికీ బిల్లులు చేయకపోతే ఎలా ప్రశ్నించారు. గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో జరుగుతున్న రోడ్లన్నీ ఒక్క కాంట్రాక్టర్‌కే ఇచ్చిన నేపథ్యంలో ఎక్కడా పని పూర్తి చేయకుండా కొబ్బరికాయ కొట్టి విడిచి పెట్టారని, దీంతో బురద రోడ్లపైనే ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. కావున తక్షణమే రహదారి నిర్మాణ పనులు చేపట్టేలా అధికారులు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మొండెంఖల్ సర్పంచ్ ఐ.గౌరీశంకర్ మాట్లాడుతూ తమ పంచాయతీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు కనీసం సర్పంచ్‌కు తెలియకుండా అధికారులు కూటమి నాయకులతో పనులు చేపట్టడం సమంజసం కాదన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్య ఎక్కువగా ఉండటంతో సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తు నిరంతరం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పనిలో చేపట్టిన గోకులం షెడ్ల బిల్లులు, లబ్ధిదారుల వేతనాలు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కోరారు. అనంతరం ఎంపిపి పద్మావతి మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఎంసి చైర్మన్ కళావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామాల అభివృద్ధి పరిస్థితుల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతుంటే గ్రామస్థాయి కొచ్చేసరికి అధికారుల నిర్లక్ష్యం కారణంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఇప్పటికైనా సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులు రాసుకొని పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. వారి సమక్షంలో లేనివైతే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయ, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, వివిధ శాఖల మండల అధికారులు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ భర్త

సమావేశంలో డమ్మీ ప్రజాప్రతినిధులు హాల్‌చల్

సర్వసభ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండి సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకురావాలి. కానీ కురుపాం సర్వసభ సమావేశంలో వింత పోకడగా కొనసాగుతుంది. మంగళవారం జరిగిన సర్వసభ సమావేశంలో ఉదయపురం సర్పంచ్ బి.అరుణకు బదులుగా ఆమె భర్త సమస్యలపై అధికారులను నిలదీశారు. అలాగే తిత్తిరి సర్పంచ్ బి.గౌరికి బదులుగా ఆమె కుమారుడు సమస్యలపై అధికారులను నిలదీశారు. అంతేకాకుండా చాలామంది ప్రజాప్రతినిధులకు బదులుగా వారి బంధువులు, మాజీ ప్రజాప్రతినిధులు కూడా సమావేశంలో కూర్చుండడంతో నియంత్రించాల్సిన అధికారి చోద్యం చూస్తుండడంతో పలువురు మండల అధికారులు ఆశ్చర్యార్థకంగా చూసి తప్పనిసరి పరిస్థితుల్లో సమాధానం చెప్పాల్సి వచ్చింది.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రెండో రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు.గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం, పేరెంట్స్ అసోసియేషన్, ఐలూ, కాంగ్రెస్, ఏపీ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలకు పాలకులు అధికారులు విలువివ్వాలని, గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను పరిహారం చెల్లించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకుని గిరిజన విద్యార్థుల మరణాలు నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, ద పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పార్వతీపురం డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వారణాసి శ్రీహరి, చుక్క చంద్రరావు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇవి నాయిడు, కాంగ్రెస్ నాయకులు తీల్ల గౌరీశంకర్ రావు, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలూ) జిల్లా అధ్యక్షులు ఎంవి రమణ, గిరిజన సంక్షేమ నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు అల్లు చందు, గౌరీశ్వరి, రజిని, అమల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు లక్ష్యాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో వాలంటీర్లు లక్ష్యాలను అధిగమించాలని ఎంపిపి ఉరిటి రామారావు ప్రకటించారు. మండల కేంద్రంలోని వెలుగు, ఉపాధి హామీ చట్టం ఆధ్వర్యంలో రెండో విడత ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసిన వాలంటీర్లకు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపిపి అన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అధికారులు తమ వంతు కృషి చేయాలని కోరారు. వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే వాలంటీర్లకు ముందుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రచురించబడే పుస్తకాలు సరఫరా చేస్తున్నామని, ఇందులోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని హితవు పలికారు. 15 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను నియమిస్తున్నామన్నారు. ఎంపిడిఒ జి.పైడితల్లి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిర్దేశించిన సమయంలోగా చదువు చెప్పాలన్నారు. లక్ష్యాలు సాధించి, మండలానికి మంచి పేరు తీసుకు రావాలని ఆమె కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు బాణాల సురేష్, అక్కేన రామకష్ణ, ఎపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, సీసీలు చందాన తిరుపతిరావు, బొంగు రామినాయుడు, వడిశాపు లక్ష్మణరావు, టి.చంద్ర మోహన్, కోటిపల్లి దాసు, ఉడమల శాంతికుమారి, వివిఎలు, పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిపి ఉరిటి రామారావు

గుమ్మలక్ష్మీపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని వాలంటీర్లు జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఎల్. శ్రీనివాసరావు కోరారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో మొదటి రోజు వెలుగు -డిఆర్‌డిఎ, ఉపాధిహామీ వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం సతీష్ ఉన్నారు. అలాగే జియమ్మ మండలంలోని 31 పంచాయతీలో ఉన్న వయోజనులైన నిరక్షరాస్యులకు విద్యను అందించేందుకు, వారికి విద్యాబోధన చేసేందుకు వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపిడిఒ ధర్మారావు తెలిపారు. ఎలా విద్యాబోధన చేయాలో అవసరమైన మెటీరియల్ అందించమన్నారు.

సమస్యల పరిష్కార వేదిక ఎక్కడ?

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు. కొన్నింటిని మాత్రమే పరిష్కరించి మిగతా వాటికి పరిష్కార వేదిక చూపలేదు. ప్రతి సమావేశంలో ఎన్నో సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ హామీలే తప్ప ఆచరణలో కానరావడం లేదు. మొక్కుబడిగా సమావేశాలతో ఎటువంటి ప్రయోజనంలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మరోసారి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. మండలంలోని ఇరిడి ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం నిర్మించి విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా చూడాలని సభలో ప్రస్తావించినప్పటికీ నేటికీ పరిష్కారం చూపలేదు. దీంతో ఇటీవల తుఫానుకు తాత్కాలిక రేకుల షెడ్ నీట మునిగిందని చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ తెలిపారు. గిరి శిఖర గ్రామాలకు రోడ్లు వేసి డోలిమోతల నుంచి గిరిజనులకు విముక్తి కల్పించాలని కోరినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో గిరిజనులకు నేటికీ కాలిబాట తప్పడం లేదు. వైద్యం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనులు పండిస్తున్న ఆహార, వాణిజ్య వరి, జీడి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని ఎన్నోసార్లు ప్రస్తావించినా కనీసం పట్టించుకోవడం లేదు. సమస్యలు పరిష్కారం కానీ సమావేశాలు ఎందుకని పలువురు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నేటికీ వెంటాడుతుంది. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించి స్థానికంగా విద్యార్థులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని గత సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించినా నేటికీ నియామక చర్యలు కాన రాలేదు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా, మలుపుల వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే చర్యలు చేపట్టాలని ప్రస్తావించినప్పటికీ కనీసం స్పందించలేదు. ఇలా గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కారమైతే ప్రస్తుత సమావేశాలకు ప్రాధాన్యత ఉంటుందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు.



ఫిల్లర్లకే పరిమితమైన ఇరిడి పాఠశాల

వాతావరణ మార్పుపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పివి.ఇతమానుగూడ పంచాయతీ పరిధిలో డొంబంగివలసలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వాతావరణం మార్పు - ప్రభావాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరావు, గ్రీన్ హౌస్ అంటే ఏమిటి? గ్రీన్ హౌస్ ఉపయోగాలు, వాతావరణం మార్పు వల్ల కలిగే ప్రభావాలు కోసం, అడవి పెంచడం వల్ల కలిగే లాభాలు వివరించారు. అడవిలో దుంపలు, ఆకుకూరలు, మందులు ఉపయోగా లు, చిరుధాన్యాలైన కొర్ర, సామ, రాగుల ఉపయోగాలు, పంట దిగుబడి పెంచేందుకు మెళకువలు, జీడీ ప్లునింగ్ వల్ల ఉపయోగాలు, వరి లైన్ షోయింగ్, శ్రీవరి, వరి, జమున మోడల్, గులిరాగి, వాటి ఉపయోగాలు గురించి వివరించారు. అలాగే పురుగు మందులు బదులుగా నీమస్త్రం, జిల్లేడు ద్రావణం, పంచపత్ర కాషాయం, వేప నూనె ఉపయోగించాలని, రసాయనిక మందులు బదులుగా ఘన, ద్రవజీవామృతాలు, గోకృపామతం ఉపయోగించి మంచి పంటను పొంది ఆరోగ్యం పెంచుకోవాలని వివరించారు. రైతులకు ఉపాధి పనుల ద్వారా మిశ్రమ తోటలను పెంచి, వ్యవసాయానికి ఉపయోగించి గట్లుపై కూరగాయలు, పండ్లు మొక్కలు, వేసి ఆర్థికంగా వేదగాలని, మన ప్రాంతంలో ఉన్న గ్రామాలు బయో గ్రామాలుగా మార్చేందుకు రైతులంతా సహకరించాలని తెలిపారు. ఈ శిక్షణకు సలభంపాడు, నెలిగండి, ఎగువ,దిగువ డొంబంగివలస గ్రామాల నుంచి 42 మంది రైతులు పాల్గొన్నారు. వెలుగు అసోసియేషన్ నుంచి బి.రామయ్య సిసి, వెలుగు సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కొత్తగా ప్రవేశపెట్టిన ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రజలు డౌన్లోడ్ చేసుకోవాలని ఎక్సైజ్ సిఐ పి.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ యాప్ ద్వారా లైసెన్స్ షాపుల్లో మద్యం బాటిళ్లను ఇ వ్యాపార స్కాన్ చేసుకొని నాణ్యతను తనిఖీ చేసుకోవచ్చన్నారు. షాపు యజమానులు చట్టంలో గల నియమ, నిబంధనలను పాటించాలని, మద్యాన్ని ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని అన్నారు. ఎక్కడైనా గొలుసు దుకాణాలు గాని, పరుగు రాష్ట్రాలకు చెందిన అక్రమ మద్యం గానీ, నాటు సారా ఉంటే 9494902373 ఫోన్ నెంబర్‌కు తెలపాని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించరాదని హెచ్చరించారు.

120 లీటర్ల నాటుసారా స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కురుపాం

120 లీటర్ల నాటు సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని జియ్యమవలస మండలంలో తాళ్ళుడుమ్మా, అల్లువాడ గ్రామాల పరిధిలో నాటుసారా అమ్మకాలు నిరోధించే ఉద్దేశ్యంతో మంగళవారం దాడులు నిర్వహించగా 120 లీటర్ల నాటు సారా, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చినమేరంగికి చెందిన వెలగాడ చందు, బొమ్మాళి నవీన్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వీరిద్దర్ని జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పది లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తకోట సమీపంలో సూర్యనారాయణ 10 లీటర్లు సారా తెస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. సూర్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా నిర్మూలనకు అంతా సహకరించాలని కోరారు.

గెడ్డలో పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని చంద్రంపేట ఆరవసంత గెడ్డ వాగులోని సోమవారం రాత్రి విజ్జపు సోమరాజు (55) పడి గల్లంతయ్యాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియకపోవడంతో పలుచోట్ల వెతికి బంధువుల ఇళ్లల్లో కూడా వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో గెడ్డలోని కొట్టుకుపోయి ఉంటాడని ఉద్దేశంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటలు తర్వాత స్థానికులు గెడ్డలో మునిగి ఉన్న మోపెడ్ బండిని గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గంట్యాడ తహశీల్దార్ నీలకంఠశివ రెడ్డికి గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, ఎంపిడిఒ రమణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని ఎపి ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినీ ఫలితం లేకపోయింది. విఆర్ఒ రవి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలుపుదల చేశారు.



దుకాణదారునికి నోటీసు అందజేస్తున్న శానిటేషన్ సిబ్బంది

వాయు కాలుష్యంపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

వాయు కాలుష్య నియంత్రణపై స్థానిక మున్సిపాల్టీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని 15 వాణిజ్య సంస్థలకు (స్వీట్స్, బేకరీలు, హోటల్స్, థాబాలు) మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం 'క్లీనర్ ఎయిర్' (పరిశుభ్రమైన గాలి) లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ ఆదేశాల మేరకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో గల బేకరీలు స్వీట్ షాపులు కార్ఖానాలను తనిఖీలు చేసి 15 షాపులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీట్ షాపులు బేకరీ షాపులు కార్ఖానాల ద్వారా బయటకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు గురై తీవ్ర ఆరోగ్య సమస్యల పాలవుతున్నారని అన్నారు. తినుబండారాలు తయారు చేయడానికి ఈ సంస్థలు వినియోగిస్తున్న రంపం పొట్టు, ఊక, కర్రల పొయ్యిల నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ కారణంగా పట్టణంలో వాయు కాలుష్యం తీవ్రమవుతున్నట్టు గుర్తించామని తెలిపారు. ఈ కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, ముఖ్యంగా టిబి, శ్వాసకోశ వ్యాధులు వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆయన తెలిపారు. వాయు కాలుష్యాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా ఈ 15 దుకాణాలను గుర్తించి, పర్యావరణ కార్యదర్శులు (సెక్రటరీల) ద్వారా వారికి నేరుగా నోటీసులను అందజేశామని తెలిపారు. మున్సిపల్ ఆదేశాల ప్రకారం నోటీసులు అందిన 24 గంటల్లోగా తమ సమాధానాన్ని మున్సిపాల్టీకి లిఖిత పూర్వకంగా సమర్పించాలని, నోటీసు అందిన వారం రోజుల్లోపు కాలుష్యానికి కారణమవుతున్న రంపం పొట్టు, ఊక, కర్రల పొయ్యిలను పూర్తిగా తొలగించాలని, తమ వ్యాపారాలకు ఇకపై గ్యాస్ పొయ్యిలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. మున్సిపాల్టీ జారీ చేసిన ఈ ఆదేశాలను ఏ ఒక్కరూ ఉల్లంఘించినా, వారి వ్యాపార లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తొలగింపు ఆలోచన మానుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ శాఖ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగింపు ఆలోచన మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాలు గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసిందని, కూటమి ప్రభుత్వం మాత్రం వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేయడం అన్యాయమని అన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉపాధ్యాయుల తొలగింపు ఆలోచన మానుకోవాలని, యధావిధిగా కొనసాగించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే జిఒ 3 లేకుండా డిఎస్సీ నిర్వహించి గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ శిక్షణ పొందిన యువతకు టీచర్ ఉద్యోగాలు రాకుండా చేశారని రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా వ్యాన్ క్యాబిన్లో చిక్కుకొని డ్రైవర్ పెనుమాక రాజు (36) మంగళవారం మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం కు చెందిన ఈయన గోనెసంచులు పట్టుకొని ఐచర్ వ్యాన్ వీరఘట్టం వచ్చారు. కొత్తకోట వెంకటరమణ షాపులో దించాల్సిన గోనె సంచులను అన్లోడ్ చేసేందుకు వీలుగా కట్లు విప్పుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి క్యాబిన్లో పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకొని ప్రాణాపాయం లేకుండా తీసేందుకు ప్రయత్నించారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. స్థానికులు సహకారంతో ఆయన్ని స్థానిక చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది.

మెట్ల నుంచి జారిపడి విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - మక్కువ



గాయపడ్డ విద్యార్థి భార్గవ్

ఎస్ ఎన్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న కొవ్వాడ భార్గవ్, చైతన్య మంగళవారం స్కూల్ మెట్లు దిగుతుండగా జారిపడడంతో గాయాల పాయలయ్యారు. భార్గవకు చేయి దెబ్బతినగా, చైతన్య తలకు గాయమైంది. దీంతో వీరిని స్థానిక పిహెచ్‌సిలో చికిత్స అందించినట్లు హెచ్ఎం సంపం తెలిపారు. పాఠశాల విడిచి పెట్టే సమయంలో పై అంతస్తులో చదువుతున్న విద్యార్థులు పరీక్షల అనంతరం మూకుమ్మడిగా ఒక్కసారి మొదటి అంతస్తు నుంచి దిగుతుండగా మెట్లపై నుండి జారిపడినట్లు తెలిసింది.

పట్టణంలో చోరీ

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని రాజాం రోడ్‌లో అన్నవరం వద్ద షిర్డీ సాయిబాబా ఆలయం దగ్గర ఉన్న ఐరన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. కె.గణేష్‌కు చెందిన ఈ షాపు తాళాలు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో ఆయన మంగళవారం ఉదయం వచ్చి సరికి రూ.2,50,000 విలువైన వస్తువులు పోయినట్లు గుర్తించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ప్రయోగమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.